ప్రజాశక్తి
శనివారం 22 జులై 2023

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ఇదొక మంచి ప్రయత్నమన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. వివరించారు. ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 12 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగులకు గ్రీవెన్స్ నిర్వహించడంపట్ల ఎపి రెవెన్యూ సేవల సంఘం, ఎపిజెఎసి అమరావతి సంఘంకలెక్టరు నిశాంత్ కుమార్‌ను కలిసి ప్రభుత్వానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు జెఎసి అధ్యక్షులు గొట్టాపు శ్రీరామ్మూర్తి, ఉద్యోగ సంఘ నాయకులు కలెక్టర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

గిరిజన జీవనంపై పాలకవర్గాల దాడి

గిరిజన అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి కురుపాం / గుమ్మలక్ష్మీపురం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకొచ్చి ఆదివాసీ గిరిజన జీవన విధానంపై తీవ్రంగా దాడి చేస్తోందని ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ మిడియం బాబూరావు అన్నారు. కురుపాంలో జరుగుతున్న ఎపి గిరిజన సంఘం ఏడో జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలకు ఇష్టారాజ్యంగా అనుమతులిస్తూ తరతరాల నుంచి అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులను బ్రాక్సైట్ తవ్వకాల పేరుతో దూరం చేస్తున్నారని అన్నారు. గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జిఒ 3ను రద్దు చేసి ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందన్నారు. 1/70 చట్టం పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పడ్డ ఐటిడిఎ, జిసిసి సంస్థలకు నిధుల్లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. అటవీ హక్కు, పీసా, ఉపాధిహామీ చట్టాలను ఎత్తివేసేందుకు చర్యలు సిద్ధం చేస్తుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం చేసేందుకు మోడీ సర్కార్ ప్రయత్నాలు సాగిస్తోందన్నారు. ఇదే జరిగితే ఇందులో పనిచేస్తున్న 1500 మంది గిరిజన ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోల్పోతారని అన్నారు. బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు రాష్ట్రంలో వైసిపి కూడా వంత పాడుతూ కొనసాగిస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి సిద్ధపడిందన్నారు. సవర భాష వాలంటీర్లు తొలగించి విద్యాబోధనకు దూరం చేసిందన్నారు. బిజెపి భావజాలానికి వ్యతిరేకంగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులను చైతన్యవంతం చేయాలని కోరారు. గ్రామ గ్రామాన ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి హక్కులు, చట్టాలు రక్షణ పొందడానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలతో గిరిజనుల మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. తరతరాల నుంచి పోడు వ్యవసాయం చేస్తున్న భూమిపై హక్కు కల్పించేందుకు సాగుకు పట్టాలివ్వడం లేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో పాఠశాలలను ఎత్తివేసి ప్రభుత్వ విద్యకు గిరిజనులను దూరం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం గిరిజన సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్ ఉద్యమాలకు కార్యచరణ రూపొందించారు.

మహాసభను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ మిడియం బాబూరావు

అమరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా లక్ష్మణరావు, అవినాష్

మహాసభల అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎస్.అప్పారావు, అధ్యక్షులుగా ఎం.లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, సీతారాం, కె.రామస్వామి, ఎన్.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్, సహాయ కార్యదర్శులుగా పి.తిరుపతిరావు, బి.వెంకటరావు, కోశాధికారిగా ఎం రమణ ఎన్నికయ్యారు.

డిసెంబర్‌లోగా వంద పడకల ఆస్పత్రి

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో నిర్మిస్తున్న వందపడకల ఆస్పత్రిని డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ నిర్మాణ ఏజెన్సీని ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా వందపడక ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆస్పత్రి నిర్మాణంలో నాణ్యతా లోపాల్లేకుండా చూడాలన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని నెలిపర్తి హౌసింగ్ కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం కావాలని, ఇందుకు లబ్ధిదారులను చైతన్యపర్చాలని అన్నారు. అప్రోచ్ రోడ్లు, నీరు, తదితర సౌకర్యాలు కల్పించామని, నిర్మాణ స్థాయిలను మార్చేందుకు సౌకర్యాలను వినియోగించుకోవాలని తెలిపారు. పేదల ఇళ్లు పూర్తి చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన చెప్పారు. వచ్చే 15 రోజుల్లో గృహ నిర్మాణాల్లో ప్రగతి కనిపించాలని స్పష్టం చేశారు. సాలూరులో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనాలు, జీగిరాంలో రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని వ్యవసాయ అసిస్టెంట్‌ను ఆదేశించారు. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయని, అవసరమైన సాంకేతిక సలహాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు, మున్సిపల్ సూపరింటెండెంట్ వేణుగోపాల్, గృహ నిర్మాణ సంస్థ జెఇ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పనులను అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

212 మంది నేతన్నలకు సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్

వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద జిల్లాలో 212 మంది చేనేత వృత్తిదారులకు రూ.24 వేలు చొప్పున రూ.50.88 లక్షలు ఆర్థిక సహాయం అందజేసినట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. నేతన్న నేస్తం పథకం ఐదో విడత కార్యక్రమం తిరుపతి జిల్లా వెంకటగిరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాలో వైఎస్ఆర్ నేతన్న నేస్తం ఐదో విడత కార్యక్రమం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం జెసి మాట్లాడుతూ చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచాలని, వారి మగ్గాలను ఆధునీకరించుకొనేందుకు, వస్త్ర ఉత్పత్తి పెంపు ప్రోత్సహించేందుకు రూ.24 వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ ఎడి ఎన్. వెంకటరమణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు చెక్కును అందజేస్తున్న జెసి గోవిందరావు

24న ఏకలవ్య కళాశాలలో కౌన్సిలింగ్

సీతంపేట : ఈనెల 24న ఏకలవ్య కళాశాలలో విద్యార్థులు ప్రవేశానికి రెండో విడత కౌన్సిలింగ్ భామిని- కొత్తూరులో ఏకలవ్య కళాశాలలో నిర్వహిస్తున్నట్లు డిడి ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎ పరిధిలో గల గురుకులాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్స్ కళాశాలల్లో మిగిలిన సీట్లకు నిర్వహిస్తున్న కౌన్సిలింగ్‌కు విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. తల్లిదండ్రుల ఆదాయం లక్ష రూపాయలుమించి ఉండరాదని అన్నారు.

'సమతా'కు తృటిలో తప్పిన ముప్పు

ప్రజాశక్తి - పార్వతీపురం

హజరత్ నిజాముద్దీన్ నుంచి విశాఖ వస్తున్న సమత సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తృటిలో తప్పింది. శుక్రవారంర రాత్రి పార్వతీపురం టౌన్ స్టేషన్ నుంచి పార్వతీపురం స్టేషన్‌కు వస్తుండగా మార్గమధ్యలో ఇంజన్ నుంచి బోగీలు విడిపోయాయి. లోకో పైలట్ విషయాన్ని గ్రహించి తిరిగి ఇంజన్‌ను బోగీ వైపుతీసుకెళ్లి జోడించారు. దీంతో రైలు గంటన్నర నిలిచిపోయింది.

నిబంధనల మేరకు రీసర్వే

మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ జి.నాగరాజు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీసర్వేను ప్రభుత్వ నిబంధన మేరకు పూర్తి చేయాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ జి.నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీకి వచ్చిన ఆయన కమిషనర్ జె.రామఅప్పలనాయుడుతో కలిసి పట్టణంలో పలు వార్డుల్లో జరుగుతున్న ప్రభుత్వ ఆస్తుల భూసర్వే జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కమిషన్ ఛాంబర్‌లో అన్ని విభాగాల అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రీజియన్‌లో ఉన్న 11 మున్సిపాలిటీల్లో 9 మున్సిపాలిటీల్లో రీ సర్వే పూర్తయిందని, మిగిలిన మూడు మున్సిపాలిటీల్లో జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం పార్వతీపురం మున్సిపాలిటీలో ఉన్న ప్రభుత్వ భూముల రీసర్వే చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రైవేటు వ్యక్తుల ఆస్తులకు సంబంధించి భూ సర్వే చేస్తామన్నారు. ఆగస్టు నెలాఖరులోగా ఈ సర్వేను పూర్తి చేసేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. రీజియన్‌లో ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో ఉన్న కోర్టు కేసులు పెండింగ్ ఏ దశలో ఉన్నాయోనని పర్యవేక్షించేందుకు వచ్చానన్నారు. కేసులపై ఆయా శాఖ అధికారులు స్పందించి కౌంటర్ దాఖలు చేసి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు ముందుకు సాగాలన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాల మేరకు అన్ని మున్సిపాల్టీల్లో ఇంటి పన్నుల వసూలు శతశాతం జరిగిందన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీలో దీర్ఘకాలికంగా ఉన్న డంపింగ్ యార్డ్ తరలింపు సమస్యను మునిసిపల్ సిడిఎంఎ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, త్వరలో సమస్య పరిష్కారం జరుగుతుందని అన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల కొరత ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీన్ని సిడిఎంఎ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే కార్మికులను నియమించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు

క్షేమంగా గమ్యానికి చేర్చే బాధ్యత మీదే

కార్మికుల సమావేశంలో ఆర్‌టిసి ఎమ్‌డి తిరుమలరావు

ప్రజాశక్తి - సాలూరు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను నిర్దేశిత గమ్యానికి క్షేమంగా చేర్చాల్సిన బాధ్యత కార్మికులదేనని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.ద్వారకాతిరుమలరావు చెప్పారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ డిపోను ఆయన పరిశీలించిన అనంతరం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో 1500 కొత్తబస్సుల కొనుగోలుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. అన్ని డిపోలకు కొత్త బస్సులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కరోనా సమయంలో సంస్థ 332మంది కార్మికులను కోల్పోయిందన్నారు. కారుణ్య నియామకం కింద 884మందికి ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. కార్మికుల పిఎఫ్ బకాయిలు రూ.960 కోట్లు చెల్లించామని తెలిపారు. సంస్థ లాభాల బాటలో నడవడానికి కార్మికులు కృషి చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకు ముందు డిపో యూనియన్ నాయకులు ఎంఎస్ నారాయణ, బిఎ రావు ఎండి ద్వారకాతిరుమలరావుకి స్వాగతం పలికారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఎమ్ డి ద్వారకాతిరుమల రావుని మర్యాదపూర్వకంగా కలిశారు.

మానవ అక్రమరవాణాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మానవ అక్రమరవాణాపై ప్రజలు అప్రమత్తతతో ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో కనిపించకుండాపోయిన తిరిగి దొరకని పిల్లల కేసులపై ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ. సురేష్‌తో కలిసి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న సమస్యల్లో మానవ అక్రమరవాణా ఒకటని తెలిపారు. జిల్లాలో మానవ అక్రమ రవాణా జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు తెలిపారు. ఉద్యోగాలు, సినిమా అవకాశాలు, ప్రేమ పేరుతో అమ్మాయిలను మోసగించి వారిని అక్రమ రవాణా చేసే అవకాశం ఉందని, అటువంటి వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అక్రమరవాణాకు గురయ్యే మహిళలను వ్యభిచారగృహాలకు, పిల్లలను బిక్షాటన ముఠాలకు, మానవ అవయవాల అక్రమ రవాణా ముఠాల బారిన పడే అవకాశం ఉందన్నారు. మహిళలు, పిల్లలను మోసగించే ముఠాల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం అటువంటి కేసులు నమోదైనప్పటికీ నిరక్షరాస్యులైన ఈ ప్రాంత ప్రజలు మోసగాళ్ల బారిన పడకుండా పోలీసు అధికారులు, ప్రజలు జాగరూకతతో మెలగాలన్నారు. కార్యక్రమంలో సిఐ బిసిహెచ్ స్వామినాయుడు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సాలూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న ఐద్వా, సిఐటియు నాయకులు

మహిళలపై అఘాయిత్యాలు దారుణం

మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

ప్రజాశక్తి - సాలూరు

మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు దారుణమని సిఐటియు, ఐద్వా నాయకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, ఐద్వా నాయకులు టి.ఇందు ఆధ్వర్యాన మహిళలు మోడీ ప్రభుత్వం తీరును నిరసిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్వైనాయుడు మాట్లాడుతూ మణిపూర్‌లో గత మూడు నెలలుగా మారణహోమం జరుగుతుంటే మోడీ ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. మే 4న ముగ్గురు మహిళలను అత్యాచారం చేసి, నగ్నంగా ఊరేగించడం సభ్య సమాజం తలదించుకునేలా వుందని చెప్పారు. వీరిలో ఇద్దరిని హత్య చేయడం కిరాతక చర్య అని అన్నారు. మే18న ఈ సంఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే ఈనెల 19 వరకు తెలియకుండా బిజెపి గోప్యంగా వుంచిందని చెప్పారు. జూలై 19న సోషల్ మీడియాలో వచ్చే వరకు ప్రపంచానికి ఈ విషయం తెలియదన్నారు. అత్యంత దారుణం సంఘటనలు జరుగుతున్నా మోడీ ప్రభుత్వం మౌనం వహిస్తుండడం అన్యాయమన్నారు. మణిపూర్‌లో రెండు గిరిజన తెగల మధ్య చిచ్చు రేపి బిజెపి ప్రభుత్వం మౌనం వహిస్తుండడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు స్వప్న, సీత, సిఐటియు నాయకులు టి.శంకరరావు పాల్గొన్నారు.

కురుపాం : మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగింపుగా తీసుకుని వెళ్లిన సంఘటయావత్తు భారతదేశానికే సిగ్గు చేటని, అన్ని వర్గాలు ఈ దుశ్చర్యలను తీవ్రంగా ఖండించాలని ఎపి ఆదివాసీ జాగృతి సంఘం అధ్యక్షులు కె.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్రపతిగా గిరిజన మహిళకు అగ్ర స్థానంలో కూర్చొపెట్టి అనేక రాష్ట్రాల్లో ఆదివాసీ తెగల మధ్య గొడవలు సృష్టించి బిజెపి దుష్ట రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై మానవ హక్కుల సంఘాలు, సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకారం చేసి నిరసనలు అదుపు చేసేందుకు దేశవ్యాప్తంగా అందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు.

కలెక్టరేట్ : మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజీనామా చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. మణిపూర్ ఘటనను ఖండిస్తూ ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం జాయింట్ కలెక్టర్ గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు బాధ్యత వహిస్తూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజీనామా చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి డి .వర్మ, సహాయ కార్యదర్శులు ఎం.భాస్కరరావు, పి.శ్రీను నాయుడు, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యులు పి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విఆర్‌ఎల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సమస్యల పరిష్కారం కోరుతూ విఆర్‌ఎలు చేపడుతున్న రిలేనిరాహారదీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ దీక్షలకు సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపారు. శిబిరాన్ని సందర్శించిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరిస్తారని విఆర్‌ఎలు ఓట్లు వేసినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మోసగించిందన్నారు. ఎన్నికల ముందు సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులు నిరాహార దీక్ష చేస్తున్నారని, ప్రభుత్వ స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎల న్యాయపరమైన కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని, నామిని విఆర్‌ఎలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, అర్హులైన విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతు కల్పించాలని, డిఎతో కూడిన కూడినవేతనం చెల్లించాలని, 65ఏళ్లు దాడి మరణించిన కుటుంబంలో కాంపాసినేట్ కింద ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే ఆగస్టు 7,8 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమములో విఆర్‌ఎలు విజయ్‌కృష్ణ, ఆదినారాయణ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: సమస్యలను పరిష్కరించాలని విఆర్‌ఎలు చేపట్టిన రిలేనిరాహారదీక్షలు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగాయి. ఈ దీక్షలనుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో విఆర్‌ఎల జీతాలు పెంచాలని, ఉద్యోగత భద్రత కల్పించాలని, గతంలో ఇచ్చిన డిఎ తిరిగి వెనక్కి తీసుకునే పద్ధతి విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల సిఐటియూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తారని హెచ్చరించారు. ఈ దీక్షలకు రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బుచ్చిబాబు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము, బత్తిని రామయ్య, మడపాన శ్రీనివాసరావు, గుణుపూర్ ప్రసన్నకుమార్, రేగాన ప్రసాద్, మాధవ రావు, డి.పారమ్మ, జయమ్మ, మంగమ్మ, పార్వతి పాల్గొన్నారు.

సీతానగరం : సమస్యల పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు రెండోరోజూ నిరసన దీక్షలు కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, సంఘం నాయకులు వడ్డీ సూరి నాగయ్య, సింహాచలంతో పాటు పలు గ్రామాలకు చెందిన గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎ దీక్ష రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు మాట్లాడుతూ తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 7,8 తేదీల్లో కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే దీక్షలకు విఆర్‌ఎలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండలంలో గల విఆర్‌ఎలు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న విఆర్‌ఎల దీక్షలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథ రావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఎలు సుదర్శన రామయ్య బాబురావు జ్యోతి శ్రీను నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మన్మధరావు

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యాన రెండో రోజు కూడా విఆర్‌ఎ లు దీక్షలు చేపట్టారు.సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు దీక్షలకు మద్దతు పలికారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.పాపారావు, మోహన్ రావు పాల్గొన్నారు.

పాచిపెంట : విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలంటూ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రభావతి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విఆర్‌ఎలు పి.అశోక్, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

భామిని : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఎ రిలే నిరాహార దీక్ష జరిగాయి. ఈ దీక్షలనుద్దేశించి విఆర్‌ఎ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మిన్నరావు మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ ఎన్.అప్పారావుకు వితిని అందజేశారు. కార్యక్రమంలో విఆర్‌ఎలు ఎన్.మాధవ, మరియమ్మ, లక్ష్మి, జాను పాల్గొన్నారు.



పాలకొండ, పార్వతీపురంలో దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రమణారావు, వెంకటరమణ

సీతానగరంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షల్లో పాల్గొన్న విఆర్‌ఎలు

ఇంటింటి ఓటరు నమోదులో పాల్గొన్న ఆర్‌డిఒ హేమలత

ఓటరు జాబితా పరిశీలన పక్కాగా జరగాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఓటర్ల సమగ్ర రివిజన్ పక్కాగా జరగాలని ఆర్‌డిఒ కె.హేమలత ఆదేశించారు. మండలంలోని కృష్ణపల్లిలో 4,5 పోలింగ్ కేంద్రాలు, సీతానగరం మండలంలో 127,128 పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. హౌస్ టు హౌస్ వెరిఫికేషన్‌లో అంతా పాల్గొనాలని కోరారు. పోలింగ్ కేంద్రాల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇదివరకే అయ్యాయని వాటిని పాటించాలని చెప్పారు. బిఎల్‌ఒలు సంబంధిత ఫారాలు నింపి దరఖాస్తుదారుని సంతకం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి బిఎల్‌ఒ దగ్గర, తమ పరిధిలో గల ఓటరు జాబితా, రిజిస్టర్లు, బిఎల్‌ఒల పేర్లు, ఫోన్ నెంబర్లను ఉంచాలని ఆదేశించారు.

నాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్న రైతులు

ఊపందుకున్న ఉబాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే వెంకటాపురం, లక్ష్మీపురం, బుడ్డిపేట, బూర్జ కృష్ణరాయపురం తదితర గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో వరినాట్లకు పంట పొలాల్లో ఊపందుకున్నాయి. దీంతో నాట్లు వేసేందుకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్ పెరిగిపోయింది. తుఫాను ప్రభావంతో మరికొన్ని రోజుల్లో పూర్తిస్థాయిలో ఉబాలు పూర్తవుతాయని రైతులు చెప్తున్నారు.

గొర్లెకు బుజ్జగింపు

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్‌కు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్న సీనియర్ నాయకులు గొర్లి జగన్మోహన్‌రావుకు బుజ్జగింపు ప్రయత్నాలు మొదలయ్యాయి. పార్టీలో తనకు తగిన ప్రాధాన్యత లేనప్పుడు పదవుల్లో కొనసాగడం వ్యర్థమని భావించిన గొర్లి జగన్మోహన్‌రావు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్న విషయం 'ప్రజాశక్తి' ప్రచురించింది. దీంతో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రంగంలోకి దిగి గొర్లి జగన్మోహన్ రావుతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలో సాలూరు వస్తానని, సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు కూడా గొర్లి జగన్మోహన్‌రావు నివాసానికి వెళ్లి బుజ్జగింపు ప్రయత్నాలు చేశారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర విశాఖపట్నం వెళుతున్నారని, తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని దండి సూచించినట్లు తెలుస్తోంది.

నర్సరీ అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ సవరకోటపాడు ఉద్యానవన కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పనులు చేపట్టాలని సూచించారు. విశ్రాంతి గూడారాలు, చిన్నపిల్లల పార్క్, బోటు షికారు వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పనులకు సహకరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీని ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి గాను టిడి పారాపురం వద్ద మంజూరైన డంపింగ్ యార్డ్ పనులకు అధికారులు సహకరించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, డిఎస్‌పి కృష్ణారావుకు శుక్రవారం వినతిని అందజేశారు. డంపింగ్‌యార్డు పనులను కొందరు వ్యక్తుల అడ్డుకుంటున్నారని, దీనివల్ల వర్షాకాలం దృష్ట్యా సమస్య తీవ్రతరమవుతున్నందని అన్నారు. వినతిని అందజేసిన వారిలో నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు కూడా ఉన్నారు.

బోయ, వాల్మీకులను గిరిజన జాబితాలో కలపొద్దు

ప్రజాశక్తి - బెలగాం

బోయ వాల్మీకులను గిరిజన తెగల జాబితాలో కలపొద్దని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్, ఆరిక ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని గిరిజన స్థానిక ప్రజాప్రతినిధుల సంతకాలు సేకరించి, స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు ద్వారా ద్వారా రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి,కార్యదర్శి, రిజిస్టర్ ఆఫ్ సెన్సెస్ డైరెక్టర్ లకు వినతిపత్రాలు పోస్టుద్వారా పంపించామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు కూడా వినతిపత్రాన్ని అందజేసినట్లు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో కలిపితే ప్రస్తుతం గిరిజన తెగల్లో ఉన్న వారికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఆదివాసీ ఉత్సవాలు గుమ్మలక్ష్మీపురంలో జరపాలి

ప్రజాశక్తి - బెలగాం

ప్రభుత్వపరంగా ఆగస్ట్ 9 న జరుగు ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలను గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించాలని ఆదివాసీ జాగృతి నాయకులు కె.లక్ష్మణమూర్తి అధికారులను కోరారు. ఇటీవల అధికారులు నిర్వహించిన సమావేశంలో ఈ ఉత్సవాలను పార్వతీపురంలో జరుపుతున్నట్లు ఐటిడిఎలో అధికారులు స్పష్టం చేశారని, అయితే తాము గిరిజన ప్రాంతంలో జరపమని కోరగా, ప్రభుత్వం సుముఖంగా లేదన్నారు. ఈ మేరకు కలిసొచ్చే సంఘాలతో గుమ్మలక్ష్మీపురంలో ఉత్సవాలు జరపనున్నామని, ఇందుకు గానూ ఆదివారం గుమ్మలక్ష్మీపురం వైటిసిలో సన్నాహక సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని గిరిజన సంఘాలు హాజరు కావాలని కోరారు.

ఆర్ఐకి సన్మానం

ప్రజాశక్తి -బలిజిపేట

ఉత్తమ ప్రతిభ కనర్చిన ఆర్ఐ వి.ప్రసాద్‌బాబును అధికారులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావవ దినోత్సవ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఆర్ఐని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. ఎంపిడిఒ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ జానకీరాం, మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది, డిటి రత్నకుమారి, విశ్రాంత ఎంపిడిఒ భానుమూర్తి పాల్గొన్నారు.

పెద్దగొత్తిలిలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - కురుపాం

మండలం పెద్దగొత్తిలి పంచాయతీ వెంపటాపురంలో 104 అధ్యర్యంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని మొండెంఖల్ పిహెచ్‌సి వైద్యాధికారి బి.ప్రజ్ఞ నిర్వహించారు. ఈ మేరకు 65మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకువ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో 104 సిబ్బంది, ఎమ్ ఎల్ హెచ్ పి లలిత, హెల్త్ అసిస్టెంట్ కన్నారావు, ఆనంద్, ఎఎన్ఎం ప్రభ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రజ్ఞ

ముగిసిన మున్సిపల్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు రెండోరోజు దీక్షలు కొనసాగాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన దీక్షల్లో శుక్రవారం కార్మికులు పాల్గొన్నారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన దీక్షల్లో పురుష కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, చాలీచాలని జీతాలతో కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పారు. ఆప్కాస్‌లో విలీనం వల్ల కార్మికులు నష్టపోయామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు టి.శంకరరావు, టి.రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు తలపెట్టిన రిలేనిరాహారదీక్షలు రెండో రోజు కొనసాగాయి. ఈ దీక్షల్లో మున్సిపల్ కార్మికులు, మేస్త్రీలు, క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు. దీక్షలనుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెలర్చాలని డిమాండ్ చేశారు. మాట తప్పను మడమ తిప్పనన్న సిఎం అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లయినా మనకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. సమస్యలను పరిష్కరించేంత వరకూ దశల వారీ పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు న్యాయమైన పోరాటానికి అన్ని వర్గాల అన్ని రాజకీయ పక్షాలు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, క్రాఫ్ట్ డ్రైవర్ల సమస్యలు పరిష్కారం చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఫెడరేషన్ నాయకులు నాగ వంశీ శంకర్రావు, నాగ వంశీ సింహాచలం, సిహెచ్ సింహాచలం, మల్లేష్, బంగారు రవి, మామిడి శ్రీను, సత్తిరాజు, సంతు, ఆటో డ్రైవర్లు అప్పలరాజు ప్రతాప్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఫెడరేషన్ నాయకులు ఎన్‌వై నాయుడు

పాలకొండ : స్థానిక నగరపంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు తలపెట్టిన రిలేనిరాహారదీక్షలు రెండో రోజు కొనసాగాయి. ఈ దీక్షలనుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణరావు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కాపు నేస్తం లబ్ధిదారులు ఇకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

వైఎస్ఆర్ కాపు నేస్తం పథకం లబ్ధిదారులు ఇకేవైసి చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ఆర్.గడ్డెమ్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వై.ఎస్.ఆర్ కాపు నేస్తం పథకం కింద అర్హులైన 45-60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన ఒసి కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాకు చెందిన మహిళా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని అన్నారు.

జనార్దన్ థాట్రాజ్‌కు నివాళి

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

మాజీ ఎమ్మెల్యే విటి జనార్దన్ థాట్రాజ్ విగ్రహానికి కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి నివాళ్లు అర్పించారు. జియమ్మ వలస మండలం అల్లువాడ సమీపంలో ఏర్పాటు చేసిన థాట్రాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్యేగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, నాయకులు వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్, పల్ల రాంబాబు, గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, నందివాడ కృష్ణబాబు తదితరులు ఉన్నారు.

అసభ్యకర పోస్టింగ్‌లపై టిడిపి నిరసన

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షులు వంగలపూడి అనితపై వైసిపి సోషల్ మీడియా గ్రూపుల్లో అసభ్యకరమైన పోస్టింగ్‌లకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు కార్యకర్తలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం జంక్షన్‌లో నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ ఆధ్వర్యాన జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా వైసిపి సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి పోస్టింగ్‌లు పెడుతున్న వారి కుటుంబాల్లోనూ మహిళలు వుంటారన్న విషయం మరిచిపోవద్దని కోరారు. ప్రభుత్వం ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మాజీ అర్బన్ బ్యాంక్ ఉపాధ్యక్షులు పి.మోహనరావు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కాస్త వర్షం పడితే చాలు వర్షపు నీరు నిండి బురదమయంగా మారు తుంది. విధులకు వెళ్తున్న ఉద్యోగులు అచీ తూచీ అతి జాగ్రత్తగా అడుగు వేయవలసిందే. లేదంటే బురదలో కాలుజారి పడతారు. వర్షం పడిన ప్రతి సారి గుమ్మలక్ష్మీపురం జిసిసి బ్రాంచి కార్యాలయం ఆవరణంలో నీటి నిల్వతో ఇలా దర్శనమిస్తోంది.

జిసిసి కార్యాలయం వద్ద బురదమయమైన రోడ్డు

అభివృద్ధి పనులు ఆగవు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో వివిధ రూపంలో చేపడుతున్న అభివృద్ధి పనులు ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని చిదిమి గ్రామ జంక్షన్ వద్ద రూ.కోటి40 లక్షలతో బిటి రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమేపీ అన్ని గ్రామాల్లోనూ బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇటీవలే కలెక్టర్‌ను కోరగా రూ.6.50 కోట్లు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కలింగ శ్రీకాకుళం- పార్వతీపురం జంక్షన్ నుండి చిదిమి మీదగా పివిఆర్ పురం వరకు రోడ్డు పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. దీంతో 15 ఏళ్ల గ్రామస్తుల కలనెరవేరనుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని లంక వీధిలో రూ.80 లక్షలతో సిసి రోడ్డు, కాలువ పనులకు శంకుస్థాపన చేశారు.

అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

అనంతరం స్థానిక కోదండరామ కల్యాణమండపంలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల కేంద్రంలోని రహదారి అభివృద్ధి విస్తరణ పనుల్లో భాగంగా అంబేద్కర్ జంక్షన్‌లో ఉన్న అంబేద్కర్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను తొలగించారు. ఇందులో బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని భోగి కామేశ్వరరావు బంగారు షాప్ ఎదురుగా ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ నాయకులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకు విన్నవించుకున్నారు. అలాగే రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కూడా అనువైన చోట ఏర్పాటు చేసుకున్నందుకు అవకాశం కల్పించాలని స్థానిక నాయకులు కోరారు. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని స్థానిక నాయకులకు వారు సూచించారు. రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయి పైప్‌లైన్‌కు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు జరిపించాలని స్థానిక నాయకులు అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచులు దమలపాటి ఉమామహేశ్వరరావు, ఉదయాన జగన్మోహనరావు, పి.గౌరమ్మ, ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, జెడ్పీటిసి సభ్యులు జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, ఆర్ అండ్ బి డిఇ గౌరీశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఢిల్లీశ్వరరావు, జెఇ పవన్, ఎఎంసి ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ జయంతి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

జాబ్‌మేళాలో 239 మంది ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా నియోజకవర్గం స్థాయిలో స్థానిక శ్రీ వెంకటేశ్వర గవ్నమెంట్ డిగ్రీ కళాశాల ఆవరణంలో మెగా జాబ్ మేళా శుక్రవారం జరిగింది. మేళాకు 17 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. మేళాకు సుమారు 504 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, అందులో 239 మంది వివిధ కంపెనీలో ఎంపికయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉద్యోగ మేళా నిర్వహించటం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ అవకాశాలను నిరుద్యోగ యువతీ యువకులు అవకాశం అందిపుచ్చుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.చలపతి రావు మాట్లాడుతూ ఇలాంటి మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం ఇది రెండోసారని, వీటిని నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహిం చాలని అన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్ మాట్లాడుతూ ఇలాంటి జాబ్‌మేళాలు రాబోయే రోజుల్లో మరిన్ని నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోనేరు అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అమృత 2.0 ప్రత్యేక ప్రాజెక్టు ద్వారా చెరువులను, కోనేరులను అభివృద్ధి చేసి పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించి ప్రజలకు చక్కని వాతావరణం అందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పట్టణంలోని కొత్తవలస వద్దనున్న దుర్గ చెరువు అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.94 లక్షల నిధులతో 27 రకాల కాంపోనెంట్లతో చెరువును సమూలంగా అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తయారు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ పి.రామప్పలనాయుడు, ఎఇ ఆనంద్, కౌన్సిలర్లు బి.ఆనంద్, ఎస్.లావణ్య, కో ఆప్షన్ సభ్యులు ఎం.వెంకటరమణ, వైసిపి సీనియర్ నాయకులు ఎన్.సదానందం, బి.ఆదినారాయణ, కార్యకర్తలు ఎస్.చంద్ర, జి.చిరంజీవి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి రోగులు మందులు వేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులు మందులు మానేయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఎఆర్‌టి కేంద్రంలో స్వచ్ఛంద సంస్థలతో జరిగిన నెలవారీ సమన్వయ సమావేశం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ నిర్వహించింది. సమావేశంలో డాక్టర్ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ ఏ ఒక్క హెచ్‌ఐవి వ్యాధి గ్రస్తుల భాగస్వాములకు క్రమం తప్పకుండా హెచ్‌ఐవి పరీక్షలు నిర్వహించాలన్నారు. హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులకు ఎఆర్‌టి మందులతో పాటు వారి భాగస్వాములకు హెచ్‌ఐవి పరీక్షలు అక్కడే జరిగేలా ఏర్పాటు చేస్తామని, వారు క్రమం తప్పకుండా మందులు వాడేలా అన్ని చర్యలు తీసుకోవాలనిఎఆర్‌టి సెంటర్ సిబ్బందికి తెలిపారు. కార్యక్రమములో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి.బాలాజీ, జిల్లా సూపర్వైసర్ సాక్షి గోపాల్, ఎఆర్‌టి కేంద్రం వైద్యాధికారి జగదీష్, డాట్ ప్లస్ సూపర్వైసర్ డి.నాగరాజు, పిఒ షేర్ ఇండియా సోనిలాల్, విజయ నెట్వర్క్ సంస్థ ప్రెసిడెంట్, ఎం. పద్మ, ఇతర స్వచ్ఛంద సంస్థలు, కౌన్సెలర్, సిబ్బంది పాల్గొన్నారు.

సారాతో పట్టుబడ్డ వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఒడిశా నుంచి బైక్‌పై సుమారు 150 సారాయి ప్యాకెట్లను తరలిస్తున్న కె.మహేష్‌ను జీగిరాం వద్ద రూరల్ పోలీస్‌లు పట్టుకున్నారు. సారాయి ప్యాకెట్లను, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు సాలూరు రూరల్ ఎస్ ఐ ప్రయోగ మూర్తి తెలిపారు.

మెనూ అమలు చేయకపోతే కఠిన చర్యలు : డిడి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో నిర్దేశించిన మెనూ అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం స్థానిక సహాయ గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు విరివిగా పడుతున్నందున జ్వరాల బారిన విద్యార్థులు పడకుండా చూడాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలకు వెంటనే వైద్యం అందేలా చూడాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని సూచించారు. ఉన్నతాధికారుల ఆకస్మిక సందర్శనలు వుంటాయని, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు అప్రమత్తంగా ఉండాలని డిడి శ్రీనివాసరావు కోరారు.

ట్రైకార్ బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనులు తీసుకున్న ట్రైకార్ రుణ బకాయిలను వెంటనే చెల్లించాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజర్ మణికుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ట్రైకార్ రుణాలు తీసుకున్న లబ్దిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు ఎవరైతే రుణాలు తీసుకున్నారో వారు తక్షణమే చెల్లించాలని, లేనిచో అపరాధ రుసుంతో వసూలు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ కృష్ణవేణి, ఐటిడిఎ ఎపిఒ సురేష్ కుమార్, ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

వరుస వరి నాట్లతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు వరి పంటను నాటేటప్పుడు చిన్న చిన్న మెలకువలు పాటించడం ద్వారా దిగుబడిని పెంచుకొని చీడపీడలను నివారించుకోవచ్చని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని తాడూరులో రైతు యాసర్ల హరీష్ వరుసల్లో వేస్తున్న వరి నాట్లును పరిశీలిస్తూ వరి నారు 25 రోజుల లోపు నాటుకుంటే దిగుబడి బాగా వస్తుందన్నారు. కొసలు తుంచి నాటుకోవడం వల్ల కాండం తొలిచే పురుగు ఉధృతిని నియంత్రించుకోవచ్చని, వరి నాట్లు వేసేటప్పుడు పొలాన్ని దమ్ము చేసి బాగా చదును చేసి బురద ఉండేలా చూసుకోవాలని, నీరు ఎక్కువగా నిల్వ ఉంటే లోతైన నాట్లు పడతాయని, అప్పుడు దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. దమ్ములో తప్పనిసరిగా 50 కేజీల డిఎపి, 20 కేజీల యూరియాతో పాటు 15 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ బంటు దినేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు

తప్పుడు ఓటర్ల నమోదును అరికట్టండి : టిడిపి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నియోజకవర్గంలో వివిధ బూతుల్లో అక్రమంగా నమోదైన ఓటర్లను తొలగించి జాబితాను సరిచేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు శుక్రవారం డిఆర్ఒ జె.వెంకట్రావును కోరారు. ఈ మేరకు సంబంధిత జాబితాతో కూడిన వినతి అందించారు. దీనికి డిఆర్ఒ స్పందిస్తూ నెలరోజుల పాటు బిఎల్వోలు వ్యక్తిగత సర్వే సంబంధిత బూత్‌ల్లో నిర్వహిస్తున్నారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉన్నందున, వారితో కలిసి అనుమానస్పద ఓటర్లపై ఫిర్యాదు చేయాలని తెలిపారు. వినతిని అందజేసిన వారిలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రశాంత్‌కుమార్

అవ్వకు ఎస్ఐ ఆసరా

ప్రజాశక్తి - బలిజిపేట

మండలం లోని పెదపెంకిలో జరిగిన గడప గడపకు కార్యక్రమంలో ఉన్న ఎస్సై ప్రశాంత్ కుమార్ వయస్సు పైబడిన వృద్ధురాలు తన గది బయట కూర్చొని ఒంటరిగా కన్పించింది. వెంటనే స్పందించిన ఎస్సై ఆమె పక్కనే కూర్చొని ఆమెకు సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీకు ఏ కష్టం వచ్చినా నన్ను అడుగు అని, తన ఫోన్ నెంబర్ ఆమెకు ఇచ్చారు. మరసటి రోజు ఆమెను గుర్తు పెట్టుకొని, ఇంటికి వెళ్లి తనకు వీలైంత సహాయం చేసి ఆమె దీవెనలు, ఆశీర్వాదాలు పొందారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామ ప్రజలు ఎస్సై మానవతా దృక్పథం పట్ల సంతోషం వ్యక్తపరిచారు.

సీతయ్యకు ఆర్థికసాయం

మండలంలోని పెదపెంకికి చెందిన నిరుపేద, కుష్టువ్యాధిగ్రస్తుడు సీతయ్యకు బలిజిపేట ఎస్సై ప్రశాంత్ కుమార్ రూ.500, పండ్లు, బట్టలు అందజేశారు. చిలకపల్లి సర్పంచ్ అలజంగి సుందరరావు, సీతయ్యకు బట్టలు అందజేశారు. మానవతా దృక్పథం కలిగి ఎస్సై ప్రశాంత్‌కుమార్ చిలకలపల్లి సర్పంచ్ సుందరరావుకు ఆ కుటుంబీకుల అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నేతాజీ గ్రంథాలయం స్థాపకులు ఈర్ల సంజీవ్‌నాయుడు, పలగర జగదీష్ మాస్టారు, కర్రి సతీష్, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల గుర్తింపుపై అప్రమత్తం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు తెలుగుదేశం పార్టీకి అత్యంత కీలకమని అధికార వైసిపి ఓట్ల అక్రమాలను, ఆగడాలను ఎదుర్కొని నిజాయితీగా ఓటింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగాలని, అందుకు తెలుగుదేశం పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు, ఇన్‌ఛార్జిలు, అప్రమత్తంగా ఉండి దొంగ ఓట్లను అడ్డుకట్ట వేయాలని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో శత్రుచర్ల కోటలో మండల బూత్ ఏజెంట్లు, బూత్ ఇన్‌ఛార్జులతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బూత్‌కు సంబంధించి ప్రతి వందమంది ఓటర్లకు ఒక మహిళ, ఒక పురుషుడు గృహ సారథులుగా నియమించేందుకు గాను ప్రతి గ్రామపంచాయితీ నుండి జాబితా తయారు చేయాలని ఆమె కోరారు. అరకు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ మాట్లాడుతూ మొహమాటాలకు తావు లేకుండా ఎక్కడ ఓటు అక్రమాలు తలెత్తితే అధికారులను, ఇతర పార్టీ సభ్యులను నిలదీయాలని, అక్రమాలను తొలగించే వరకు రాజీ పడకూడదని ఆయన అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్, మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, పార్టీ నాయకులు నందివాడ కృష్ణబాబు, గురాన శ్రీరామ్మూర్తినాయుడు, జోగి భుజంగరావు, మూడడ్ల సత్యం నాయుడు, లంక గోపాలం, బొత్స ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా ఓటరు సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలో చేపట్టబోయే ఓటరు సర్వే సమగ్రంగా ఉండాలని తహశీల్దార్ శివన్నారాయణ అన్నారు. శుక్రవారం నుండి ప్రారంభమైన ఓటరు సర్వేలో పాల్గొనే సూపర్వైజర్లతో తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సర్వేను నిర్వహించాలన్నారు. అలాగే సర్వే నిర్వహణకు ఎన్నికల కమిషన్ ప్రకటించిన విధివిధానాలను తప్పక అనుసరించాలని కోరారు. ఒకే డోర్ నంబరుపై పదుల సంఖ్యలో ఉన్న ఓట్లు పరిశీలన, సర్వీసు ఓటర్లు(మిలటరీ), ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలను సరిచేయడం, దీర్ఘ కాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో కనుక్కొని అక్కడ జాబితాలో ఉంచాలని తెలిపారు. సమావేశంలో ఎన్నికల ఉప తహసీల్దార్, ఆర్ఐ రామకృష్ణ వివిధ శాఖల నుంచి నియమితులైన సూపర్వైజర్లు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE JUDGE: III ADDITIONAL CHIEF METROPOLITAN MAGISTRATE AT GAJUWAKA
D.V.C.No. 24 / 2018

Between :
Pola Lavanya --Complainant
And:
Pola Krishnamouli and others --Respondents

To,
The Respondent:
1. Pola Krishna Mouli, S/o Lakshumnaidu, Hindu, aged 38 years, Residing at D.No.1-49 Jogimpeta Village, Appayyapeta Post, Seethanagaram Mandal, Parvathipuram Manyam District.
2. Pola Murali, S/o Lakshumnaidu, Hindu, aged 33 years, Residing at D.No.1-49 Jogimpeta Village, Appayyapeta Post, Seethanagaram Mandal, Parvathipuram Manyam District.
3. Cheekati (Amarapu) Ganga Bhavani, W/o. Madhusudan Rao, Hindu, aged 28 years, Residing at D.No. 1-49 Jogimpeta Village, Appayyapeta Post, Seethanagaram Mandal, Parvathipuram Manyam District.

NOTICE

Please take notice that above named petitioner filed the case against you for Under Section 12 of Protection of Women from Domestic Violence Act 2005 and the same was posted to **04-08-2023** for your appearance either in person by an authorized represen tative **at 10-30 A.M.** before the Honourable Court of the III Additional Chief Metropolitan Magistrate at Gajuwaka, Visakhapatnam District, Andhra Pradesh State, failing which the matter will be decided in your absence.

(As per the order of the Honourable Court of the III ACMM at Gajuwaka)

POLINAIDU VUDAMALA
Advocate, Block No.V
Flat No. 5RA, J.K.Modern Homes
Apartment, Anthony Nagar,VSP-530002.
Cell No. 9966631486.